**కధానిక**

# కోరిక-లు

—వాణీ రంగారావు

జిల్లా కలెక్టరు బంగళా హుందాగా నిలబడిఉంది. పెద్ద ఆవరణలో తంగేడు చెట్లతోనూ, పున్నాగ చెట్లతోనూ అందమైన అడవిలా ఉంది. తంగేడు పూచినప్పుడు పున్నాగలు పూయవు. పూసే కాలంలో రాలిన పున్నాగలు తెల్లగా వెన్నెల తునకల్లా ఉంటాయి. తంగేళ్లు ఎర్రగా నిండారాపూసి ఆకాశంలోంచి ఎరుపు వర్షం కురిసి చెట్లమీద రాలినట్లు బహుసుందరంగా ఉంటుంది.

కంచెలో అల్లుకున్న రంగురంగుల బోగనెవిల్లాలూ, బిరిసేపూలూ అంతా గేవా కలర్ సినిమా సీనులా ఉంటుంది.

గత వైభవానికి గుర్తుగా మాలతీలత భవనానికి తూరుపుగా ఓమూల చెక్క మెట్ల చుట్టూ అల్లుకుని చినచిన్న వెండి గిన్నెలు పచ్చని చెట్టు మీద సువాసన లీనుతూ ఉన్నాయి.

బ్రిటిష్‌వాళ్ళ స్క్రీమింగ్‌కీ, ప్లానింగ్‌కీ నిదర్శనంగా పెద్ద పెద్ద రాళ్ళతో కట్టిన విశాలమైన భవనంలో పాముల పుట్టలోకి లాగా ఎన్ని ద్వారాలో ఎన్ని కిటికీలో, ఈ చివర నడవడం మొదలు పెడితే ఆచివరికి వెళ్ళేసరికి గంటపడుతుంది. మెట్లు దిగి ఎక్కి అన్ని గదులూ చుట్టుకుంటూ వెళ్ళాలంటే రెండు గంటలు పడుతుంది. వైకుంఠపాళీ ఆటలా ఉంటుంది.

ఆ కలెక్టరాఫీసు ముందు నించుని ఉన్నాడు మాధవ.

---

కథల పోటీలో మూడవ బహుమతి రూ. 100 లు పొందిన కథ.

టక్ చేసుకుని - నల్లగా నిగ నిగ లాడుతూ బూట్లు - ఆ విల్సన్నతీరు విమల్ వాళ్ళ ప్రకటనల్లోలా ఉన్నాడు.

ప్రాయంలో పంది పిల్లయినా అందంగా ఉంటుంది అనడానికి నిదర్శనంగా బాగానే ఉన్నాడు.

అతని మనసులో ఎన్నో ఆలోచనలు. ఆలోచనల్నిండా కోరికలు. కోరికల నిండా మారుతీ కార్లూ-బ్యాంక్ అకౌంట్లూ- స్మగుల్డు సెంట్లూ- వాచీలు.

స్కూటర్లమీద వస్తూ పోతూ ఉన్న వాళ్ళని, "పాపం స్కూటరన్నా ఉంది వాళ్ళకి" అని జాలి పడ్తుంటాడు, తనకు రాబోయే మారుతిని ఊహించుకుంటూ ఉంటాడు.

మాధవ కోరికల్లో అందమైన భార్యకూడా ఒకటి. ఆవిడ వెనకాల అపార సంపద కూడా ఉండాలి. ఈ అన్ని కోరికలూ అతని మెదడంతా ఆక్రమించి అతన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తుంటాయి.

మధ్య మధ్యన వాళ్లూ వీళ్లూ ఫలానా ఫలానా సంబంధం అని చెప్పగానే ఇవన్నీ ఒక్కుమ్మడిగా అతని మీద దాడి చేసి ఇంకా ఖంగారు పెడ్తుంటాయి.

అందులో ఏ ఒక్క కోరికా వెనక్కుపోదు. ఈతని కోరికలన్నీ తీర్చే మగాడు-ఆడ పిల్లని కన్నవాడు-ఇంతవరకు ఒక్కడూ రాలేదు.

'రాక పోతాడా' అని మాధవ అభిప్రాయం.

'వస్తాడనీ, వచ్చి తన వాకిట పడిగాపులు పడి మరీ కాళ్ళు కడుగుతాడనీ అపార నమ్మకం.

రెండు జేబుల్లో చేతులు పెట్టుకుని కులాసాగా నడుస్తున్నాడు మాధవ

కలెక్టరాఫీసులోనే పని చేస్తున్న విమల వాళ్ళాయన స్కూటరు వెనకాల ఎక్కి ఝామ్మని పోతుంది.

విమల అపాయింటుమెంట్ ఆర్డరు తనే టైపు చేశాడు నాలుగేళ్ళనాడు మాధవ.

మూడేళ్ళనాడు విమల పెళ్ళి కెళ్ళాడు. విమల భర్త కృష్ణ బ్యాంకులో గుమాస్తా. పాపం గుమాస్తా అనుకున్నాడు మాధవ అప్పుడు.

తరవాత విమలకి ఆడపిల్ల పుట్టింది. "అయ్యో పాపం ఆడపిల్ల" అను కున్నాడు మాధవ.

మరునటి యేడే మగపిల్లాడు పుట్టాడు. అప్పుడూ వెళ్ళి స్వీట్లు తిని వచ్చాడు.

ఎల్లుండి గృహ ప్రవేశం అని "ఆహ్వానం" ఇచ్చింది విమల ఈరోజు.

ఆఁ ఏం ఇల్లులే ! ఏదో చిన్న గదుల్తో సింగిల్ బెడ్‌రూం ఇల్లయి ఉంటుంది. పాపం అంతంతచే ఎక్కుణ్ణించి వస్తుంది వాళ్ళకు" అనుకున్నాడు మాధవ.

కట్టుకుంటే గ్రాండ్‌గా అంతా వెస్టర్న్ స్టయిల్‌లో మాడర్న్‌గా అప్టు డెట్‌గా కట్టాలి. అనుకున్నాడు కూడా.

"పెళ్ళి చేసుకోరా. నేనింకా ఎన్నాళ్ళు బ్రతుకుతాను ? కళ్లారా చూసి పోతాను." అంటుంది తల్లి.

ఈవిడ కోసం పెళ్ళి చేసుకోవాలా ఏమిటి ? ముసలావిడ మహా ఉంటే నాలుగేళ్ళు ఉండేను. అయిదేళ్ళు ఉండేను. నాకు సరైన సంబంధం రావద్దూ !" అనుకుంటాడు.

"అన్నయ్యా ! పెళ్ళి చేసుకోరా. తొందరగా కొడుకుని కంటే పిల్లని స్తాను." అంటుంది చెల్లెలు,

"ఆ ! నీ కూతుర్ని నేను నా కొడుక్కి చేసుకోడం కోసం పెళ్ళి చేసు కోవాలా ! నువ్వంటే నాన్న కూతురివి కనక ముష్టి ముప్పయి వేలతో బడిపంతులు కిచ్చి కట్టాడు. నా కొడుకు కలెక్టరవుతాడు. వాడి కివ్వాలంటే నీకు తాహతు ఉండద్దూ !" అనుకుంటాడు,

చెల్లెలి మాటలూ తల్లిమాటలూ ఇవేవీ అతనికి గుర్తురావు. తనకు పట్టబోయే అదృష్టాలు మాత్రం పదేపదే మనసులో నృత్యం చేస్తుంటాయి.

దిలాసాగా నడుస్తున్నాడు మాధవ. ఆరవుతోంది. కలక్టరాఫీసులో జనం పల్చబడుతున్నారు. మాధవకి ఆ ఆఫీసు ప్రాంగణం స్వంతమే అనిపిస్తుంది.

ఆ నెల ఆ పున్నాగలూ, ఆ తంగేళ్లూ, ఆ మాలతీలత పరిమళాలూ- ఇవేవీ అతన్ని కదిలించవు. ఆఫీసు రూముల్లో చేతులు మారే ఫైళ్ళు బల్లల కింది కరచాలనాలూ పెన్షన్ల కోసం తిరిగే బడిపంతుళ్లూ - ఇవీ అతన్ని రంజింప చేసే అంశాలు.

బీరువాల్లో కట్టలు కట్టలుగా విశ్రాంతి తీసుకుంటున్న ఫైళ్ళను చూస్తే ఆనందం, ఒక్క రోజు కూడా వాటిని చూడకుండా ఉండలేడు.

ఆ గంభీర కట్టడాల్లోంచి ఆ చివర్నించి ఈ చివరికీ ఒక్కసారయినాతిరక్క పోతే అతనికి తోచదు.

మాధవ నడుస్తూ నడుస్తూ ఆగిపోయాడు.

గేటులోంచి దూసుకు వస్తున్న ఫియట్‌లో డ్రైవ్ చేస్తోంది సుమలత - సుమలతేనా ! సందేహం మాధవకి.

బి.ఎలో తన క్లాస్‌మేట్ తనని చేసుకోమంటె- బక్కగా రివటలా ఉండే ఆ పిల్లా ఆమెకి వెనకాల పాతికవేల కంటే తూకం లేక పోవడం వల్ల చేసుకోలేదు. వాళ్ళ నాన్నగారొచ్చి అడిగితే- "వవ్యాసీ వన్యాసీ రాసుకుంటే బూడిద రాల్తుందండీ" అంటూ ఎగతాళి కూడా చేశాడతను.

అవును, ఆ సుమలతే.

"అబ్బో ఫీయట్ డ్రైవ్ చేస్తుందే" అనుకున్నాడు మాధవ,

కట్టుకున్న గద్వాల్ చీర నలక్కుండా సుతారంగా దిగి చుట్టూ చూసింది. మాధవ కనిపించాడు.

నాలుగడుగులు వేసింది. అసంకల్పితంగానే మాధవ ఆమె వైపు నడిచాడు.

"హలో.... మీరు...." అంది ఆమె,

"ఆ.... నేను....మాధవరావుని. బి.ఎ లో" నసిగాడు మాధవ.

"యా....యా....మనం క్లాస్‌మేట్స్ గదూ" అంది సుమలత అవునన్నట్లుగా తలాడించాడు,

"ఎక్స్‌క్యూజ్‌మీ.... జె.సి. గారి కోసం వచ్చాను. కొంచెం మీ మిసెస్ వచ్చారని చెప్పగలరా ప్లీజ్" అంది సుమలత.

"అమ్మ.... నీ.... జె సి. గాడి పెళ్ళానివా.... ఎంత సిరిపట్టింది." అనుకున్నాడు మాధవ.

ఒక్క లిప్తపాటు కొంచెం ఈర్ష్య కలిగినా, వెంటనే ఈ పరిచయాన్ని ఎలా లాభసాటిగా ఉపయోగించుకోవచ్చో ఆలోచించడం మొదలు పెట్టాడు.

అతి వినయంగా-"నెవర్ మైండ్ నేను వెళ్ళి చెప్పొస్తాను. మీరు ఒక్క నిమిషం కూర్చోండి."అంటూ లోపలికి పరుగెత్తాడు.

అంత తొందరగానూ వెనక్కు వచ్చేసాడు,

జె.సి. గారు సడన్‌గా కాంపుకి వెళ్లారుట. మీకు ఏదో నోట్ పెట్టారు." అంటూ చిన్న స్లిప్ ఇచ్చాడు.

"ఓ. కె, థాంక్ యూ వెరీమచ్. మీరేం చేస్తున్నారు." అడిగింది స్లిప్ చూసుకుంటూ,

"నేనిక్కడే స్టెనోనండి" అన్నాడు. అందుకు తనకేమీ చిన్నతనం లేదన్నట్టుగా. అయినా ఆ గొంతులో వినయం ధ్వనిస్తూనే ఉంది.

"అలాగా మేము మొన్ననే వచ్చాం, నేను ఇక్కడే పి. ఆర్. కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్నాను, తనకి లాస్ట్ మంథ్ ట్రాన్స్‌ఫరైంది." అంది.

మనసులో బాధ వీళ్ళింత ఆనందంగా ఎలా ఉండగలుగుతున్నారబ్బా అని "ఆ వీళ్ళ సంబరం ఎన్నాళ్ళులే! నాలుగు రోజులు పోయాక ఆ జె. సి. గాడు తాగుడుకీ తిరుగుడికీ అలవాటు పడక తప్పదు. అప్పుడు చూడాలి ఈవిడా కులుకు" అనుకున్నాడు.

పైకి మాత్రం నవ్వుతూ- "అలాగా! అయితే ఈ పూళ్ళోనే ఉంటారన్న మాట" అన్నాడు.

"అవును. వస్తామరి" అంటూ వెళ్ళిపోయింది.

బ్లూ ఫియట్ తన కళ్ళముందే అలా చురుగ్గా డ్రైవ్ చేసుకుంటూ ఒక ఆడ కూతురు వెళ్తూంటే మాధవకి గుండెల్లో గునపం దించినట్లయింది గానీ వెంటనే, "ఆ! ఎక్కడో రాసి పెట్టి ఉందిగానీ లేకపోతే ఈవిడకి ఈ భాగ్యం ఏమిటి? అనుకుని తృప్తిపడిపోయాడు.

చిరు చీకట్లు ముసురుకుంటున్నాయి. మాధవకి టీ తాగాలనిపించింది. మూల మీదున్న టీస్టాల్‌లో మాంచి మసాలా టీ ఘుమఘుమలాడుతూ ఉంటుంది గానీ కప్పు రూపాయి.

ఈ టైములో సాధారణంగా ఎవడైనా దొరుకుతాడు. వీలుంటే టిఫిన్ కూడా లాగించెయ్యొచ్చు.

"ప్చ్! ఇవాళ ఎవడూ తగిలేట్టు లేడు, అనుకుంటూ నిల్చున్నాడు మాధవ.

వచ్చే పోయే బస్సుల్నీ, కార్లనీ, లారీలనీ చూస్తూ నిలుచున్నాడు. "ఈ ఆడాళ్ళు సైకిళ్ళ మీదా స్కూటర్ల మీదా ఎంత స్పీడ్‌గా పోతున్నారు!" అను కున్నాడు.

"ఆ నా మొహం! సైకిళ్ళూ, స్కూటర్లూ ఆడముండలు తోలేవి, హోండా అయితే తనబోటి వాడికి బావుంటుంది" అనుకున్నాడు.

పదేళ్ళ క్రితం సైకిల్ తొక్కే ఆడపిల్ల ఒక విచిత్రం. ఇవాళ సైకిల్ అవసరమై కూర్చుంది.

హోండా శబ్దం వినిపించింది. పాంటూ షర్టూ వేసుకుని హోండా మీద పోతున్నది అమ్మాయె. ఎత్తులూ పల్లాలూ స్పష్టంగా తెలియక పోయినా ఆడపిల్లే అనేది మాత్రం తెలుస్తోంది.

"అమ్మో! ఇది ఆడది కాదు" అనుకున్నాడు.

తనూ హోండాయే కొనాలి. ఎవరికోసం ఇస్తారు ? ఎటు లేదన్నా నెలకి ఆయిదారు వేలు కళ్ళ చూస్తున్నాడు. ఇంత అయివేజున్న మొగుడు దొరకాలంటే మాటలా !

ఆఫీసులోనే వడ్డీ తాలూకు రెండు వేలు వస్తుంది. డబ్బుని డబ్బు చేసుకోడం ఎలాగో తన దగ్గర నేర్చుకోవాలి జనం. ఫ్యూచర్‌లో ఎంత సంపాయించాలో ఎంత సంపాయిస్తాదో ! నవ్వుకున్నాడు మాధవ.

అయినా తనని చేసుకోబోయే పిల్ల అదృష్టవంతురాలు. బాధ్యతలు లేవు. తను సంపాయించేది ఆ పిల్ల తెచ్చేదీ- ఒకవేళ ఉద్యోగస్తురాలే అయితే- అయితే ఏమిటి ? ఉద్యోగస్తురాలినే చేసుకుంటాడు తను-అంతా కలిపి తమకేగా.

ఆలోచిస్తూ నడుస్తున్నాడు, నాలుగు బారల దూరంలో నిండా పూచిన చెట్టు-తంగేడు- ఎర్ర తంగేడు దాని మీద కాకి దానిమీద ఒక్కటే కూర్చుని ఉంది. నల్లగా దిష్టిచుక్కలా, ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

మళ్ళీ టీ తాగాలనిపించింది. జిహ్వ తహతహలాడుతోంది. "ఆ ! ఎందుకులే ఇంటికి పోయి అన్నం తింటాంగా" అనుకున్నాడు.

"ఏమిటో ! ఈచలి అప్పుడే మొదలయింది." అనుకుంటూ నడుస్తున్నాడు,

"చీకటి పడిపోయింది. దగ్గర దారిలో పోదాములే" అనుకుంటూ కలక్టరేట్ ప్రక్కన ఉన్న చిన్న సందులోకి మళ్లాడు.

సందులోకి రాగానే ఒక్కసారిగా ఉన్నట్లుండి చవకబారు సెంటు వాసన. ఆ వాసన మాధవ నాసికా రంధ్రాలోంచి గుండెలదాకా వెళ్ళింది.

వందగజాల వరకూ ఆ వాసన వెన్నాడుతూనే ఉంది. అది రావడం ఆగి పోయాక అసంకల్పితంగానే వెనక్కి తిరిగాడు మాధవ.

రోడ్డు వారన చింత చెట్టు క్రింద క్రీనీడన ఓ ఆకారం. మెరిసే చీరఅంచు కనిపిస్తోంది. చిరుచీకటిలో విరబోసుకున్న జుట్టు మరీ చీకటిలా ఉంది. నడినెత్తి మీద- జుట్టును కట్టేస్తూ తెల్లని మల్లె పూలదండ - మెళ్లో రాళ్ళ నెక్లెస్ తళతళా మెరుస్తోంది.

మాధవకి గాజుల శబ్దం వినిపించింది. అలాగే రెండు నిమిషాలు నిల బడ్డాడు.

ఆ ఆకారం కదిలింది. చీర రంగు కనిపిస్తోంది ఎర్రగా. మరి కొంచెం ముందుకొచ్చింది ఆ ఆకారం. ఎర్రని చీరలోంచి తెల్లని లంగా కనిపిస్తోంది. కాలి పట్టీలు మోగుతున్నాయి.

మాధవ ఆకారం వైపు కదిలాడు,

ఆ ఆకారమూ అతని వైపు నడిచింది.

దగ్గర గొచ్చేశారు. అతని ముక్కుకి ఘాటయిన మరికొంత వాసన. మాగిన మల్లెపూల కుళ్ళు వాసన. అతనికి తపనగా ఉంది.

"ఎంత ?" అడిగాడు మాధవ.

"అయిదు" అంది.

"అయిదా ! మూడిస్తా" అన్నాడు.

చీకట్లో కూడా ఆ ఆకారం కళ్ళల్లో ఎర్రజీర.

"రూపాయిత్తే కాఫీ నీళ్ల రాటంలా, నాలుగిల్వు" అంది ఒక్క క్షణం అతని వంక చూసి- వెనక్కి తిరిగింది,

ఆ ఆకారం వెనకే అడుగులేశాడు.

***